క్లుప్తంగా

వైభవంగా వెంకన్న కల్యాణం



పారిజాతగిరిలో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఫాల్గుణ మాస శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవం ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెంకు చెందిన రాంబాబు, నాగ వెంకట గంగాభవాని, అశ్వారావుపేటకు చెందిన వెంకటేశ్వరరావు, శాంత కుమారి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. కల్యాణం అనంతరం ఉభయ దాతలకు శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలతో పాటు అర్చకులు ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను కార్యనిర్వహణ అధికారి మానికల రాంబాబు పర్యవేక్షించారు.

ఫ్రీజర్ బహూకరణ



ఫ్రీజర్ బహూకరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మానవత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్.రామచంద్రారెడ్డి సౌజన్యంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి అందజేసిన ఫ్రీజర్‌ను గురువారం వైద్యాధికారిణి టి.ఎస్తేరురాణి ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా రూ.60 వేలతో ఫ్రీజర్‌ను కొనుగోలు చేసినట్లు రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మానవత శాఖకు ఆసుపత్రి సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అబ్దుల్ తస్లీమ, సీతారామరాజు, ఆసుపత్రి సిబ్బంది, మానవత జిల్లా కన్వీనర్ త్రిపుర రమేష్, సంస్థ అధ్యక్షుడు బొమ్మ మోహన్, సెక్రెటరీ సిద్దార్థ, ట్రెజరర్ రామకృష్ణ, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, స్వామి, త్రినాథ్ పాల్గొన్నారు.

108 కలశాలతో శోభాయాత్ర

జంగారెడ్డిగూడెం: శ్రీ ముత్యాలమ్మ ఆలయ చతుర్థ వార్షిక వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతులతో కూడిన ఆలయ కమిటీ నేతృత్వంలో 108 మంది ముత్తయిదువులు జల కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌కు అష్టోత్తర శతకలశాభిషేకం, సహస్ర నామార్చన నిర్వహించారు. ఈ నెల 8వ తేదీ వరకూ వార్షిక వేడుకలు జరుగుతాయని, 9వ తేదీ క్రోధి నామ సంవత్సర ఉగాదిని ఆలయంలో నిర్వహిస్తున్నట్లు మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

5 వేల ఆర్థిక సహాయం



విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అశోక్‌కుమార్

కామవరపుకోట: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జోగడిగూడెం గ్రామానికి చెందిన బందెల విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్ పరామర్శించారు. రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వారి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

నగరేశ్వర స్వామి లింగ ప్రతిష్ఠ

పోలవరం రూరల్: పోలవరం గ్రామంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నగరేశ్వర స్వామి లింగప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి భారీ అన్న సమారాధన చేపట్టారు.

సమ్మక్క - సారక్కల జాతర



సమ్మక్క సారక్కలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కుక్కునూరు: కుక్కునూరులో నిర్వహిస్తున్న సమ్మక్క–సారక్కల మినీ జాతర గురువారం ముగిసింది. గత రెండు రోజులుగా సమ్మక్క–సారక్కలను సంప్రదాయ పద్ధతిలో గద్దెల పైకి చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు బోనాలు ఎత్తుకొని మేళ తాళాలతో భారీ ప్రదర్శన నిర్వహిస్తూ గద్దెల వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గద్దెల వద్ద అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మళ్లీ సంక్షేమ పాలనే రావాలి

వైఎస్సార్ సీపీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి

టి.నరసాపురం: కుల, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, మళ్లీ సంక్షేమ పాలన రావాలంటే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి కోరారు. మండలంలోని అప్పలరాజుగూడెం, పాకలగూడెం, సీతంపేట, గంగినీడుపాలెం, బండివారిగూడెం గ్రామాల్లో గురువారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు రాజ్యలక్ష్మికి అడుగడుగునా స్వాగతం పలికి నీరాజనాలు పట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించిన జగన్‌మోహన్ రెడ్డి పాడి ఇచ్చే గోవులాంటి వారన్నారు. అలాగే మేనిఫెస్టోని అమలు చేయకుండా వాగ్దానాలను విస్మరించి సంక్షేమ పథకాల అమలుకు మోకాలొడ్డుతూ ప్రజలను ఇబ్బందుల పాల్జేస్తున్న చంద్రబాబు దున్నపోతులాంటివారని విమర్శించారు. సంక్షేమ పథకాలు విస్తృత స్థాయిలో అమలు కావాలన్నా, ప్రజల జీవన ప్రమాణ స్థాయి పెరగాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలవరం ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కారుమూరి సునీల్‌ను గెలిపించాలని ఓట్లను అభ్యర్థిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు శ్రీనురాజు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, నియోజకవర్గ బూత్ కన్వీనర్ షణ్ముఖి, సర్పంచ్ జల్లా మూర్తి, వైస్ ఎంపీపీ ఊర్ల దివ్యభారతి, ఎంపీటీసీలు కర్రి రామభాస్కర్‌రెడ్డి, చింతం నాగమణి, నులకాని నరసింహారావు, నార్లపాటి వెంకట్రావు, అర్జా బాలయ్య, యర్రా గంగాధరరావు, దాసరి రాంబాబు, దేవరపల్లి ముత్తయ్య, దాకారపు సూర్యారావు, దాసరి నాగులు, దేవానంద్, గంగుల సుబ్బారావు, చింతం ఆనందరావు, ముత్తంశెట్టి లక్ష్మణరావు, దాసరి ధర్మం, కాల్నీడి సుబ్బారావు, బోళ్ల రంగారావు, కన్నం సర్వేశ్వరరావు, నల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అప్పలరాజుగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న తెల్లం రాజ్యలక్ష్మి



ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా చూడాలి



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

కామవరపుకోట: ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఓటర్లకు సదుపాయాలు కల్పించాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గురువారం మండలంలో ఆమె ఆకస్మిక పర్యటన చేశారు. ముందుగా మండలంలో కొత్తూరులో గల ఆర్అండ్‌బీ బంగ్లా సమీపంలో ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్టును ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం మండలంలో సమస్యాత్మకంగా గుర్తించిన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి, అక్కడ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటుచేసిన బూత్‌లను, సదుపాయాలను పరిశీలించారు. ఈ కేంద్రంతో పాటు మండలంలో తడికలపూడి, ఆడమిల్లి, జలపవారిగూడెం గ్రామాల్లో సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించమని, వాటి వద్ద తగిన బందోబస్తు ఏర్పాట్లు చేస్తామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రశాంతి మాట్లాడుతూ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో వెబ్ కాస్టింగ్, పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలలో సీసీ కెమెరాల నిఘా, ప్రత్యేక సాయుధ బలగాల పహారా ఉంటుందని ఆమె తెలిపారు. ఎస్పీతోపాటు జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర, సీఐ పి.రాజేష్, తడికలపూడి ఎస్సై జయబాబు ఉన్నారు.

ఏడుగురు వలంటీర్ల రాజీనామా

కొయ్యలగూడెం: మండల పరిధిలో ఏడుగురు వలంటీర్లు రాజీనామా చేసినట్టు ఎంపీడీవో అశోక్‌కుమార్ గురువారం తెలిపారు. పరింపూడి 3వ సచివాలయానికి చెందిన పూసల రాజేష్, కన్నాపురం ఒకటవ సచివాలయానికి చెందిన గోకారపు కోరేష్, సొంగ శ్రీను, సోంగా రాకేష్, కన్నాపురం రెండో సచివాలయానికి చెందిన గడ్డం చక్రధర్ రాజు, గవరవరం రెండో సచివాలయానికి చెందిన తగరం వివేక్, దిప్పకాయలపాడు సచివాలయానికి చెందిన కురసం మురళీకృష్ణ రాజీనామా చేసిన వారిలో ఉన్నారన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

కొయ్యలగూడెం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి ఎదుట మానవత శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మానవత మండల శాఖ మాజీ అధ్యక్షుడు ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీఎస్ఎన్ విద్యా సంస్థల అధినేత స్వామి చేతుల మీదుగా దాహార్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మెట్ట మీద గల 132 కేవీ సబ్‌స్టేషన్ లో మరమ్మతులు నిర్వహించే నిమిత్తం ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్ పరిధిలో సబ్‌స్టేషన్లలోని గ్రామాలకు శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5.30 గంటలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం టౌన్ సబ్‌స్టేషన్లు, తాడువాయి సెక్షన్, జీలుగుమిల్లి, కుకునూరు, వేలేరుపాడు మండలాల్లోని అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1.50 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు గురువారం వేరువేరుగా రూ.1,50,232 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా ఏలూరుకు చెందిన నెమల రాము రూ.1,00,116, లింగపాలెం మండలం కలరాయనగూడెంకు చెందిన ఎం.వెంకట సత్యన్నారాయణ రూ.50,116 ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాలను అందించి, శ్రీవారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

చింతలపూడిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



చింతలపూడి మండలం పోతునూరులో రోడ్‌షో నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజు



ఎన్నికల ప్రచారంలో భాగంగా మేము సిద్ధం అంటూ ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలతో విజయరాజు

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు

చింతలపూడి: చింతలపూడి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసి చూపిస్తానని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ తాను అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గురువారం మండలంలోని చింతలపూడి, మల్లాయగూడెం, పోతునూరు, శివపురం, మల్లేశ్వరం, యండపల్లి గ్రామాలో ఏఎంసీ చైర్‌పర్సన్, మండల అధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి ఆధ్వర్యంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రచారంలో విజయరాజు మాట్లాడుతూ రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు. వైఎస్సార్ సీపీని తిరిగి అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత మహిళలపైనే ఉందని అన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి నియోజకవర్గంలో రైతులకు సాగునీరు అందించడానికి కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజు నిర్వహించిన బైక్ ర్యాలీకి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ప్రతి గ్రామంలోనూ మహిళలు పూలవర్షం కురిపించి ఘనంగా స్వాగతం పలికారు. రోడ్‌షోలో ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, ఎంపీపీ డా బి రాంబాబు నాయక్, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి గంధం చంటి, పార్టీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్లు బొడ్డు వెంకటేశ్వరరావు, మందలపు సాయిబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, పోతునూరు సర్పంచ్ కందుల లక్ష్మీ ప్రసన్న, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కె దినేష్‌రెడ్డి, భరత్‌రెడ్డి, ఎస్ రమేష్‌రెడ్డి, కె గోవర్ధనరెడ్డి, బి చెంచమరాజు, చేపూరి ఖాదర్‌బాబు, చీకటి బాపూజీ, పింగుల ఏసు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎస్ వరలక్ష్మి, ఆర్‌వీ రామారావు, జి రాజేష్ నాయుడు, ఎం ఇమ్మానియేలు, ఎస్ కాంతారావు, గుత్తా కిషోర్, టి రాజు, టి భూపతి , త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, ఎ సుబ్బారావు, కె ఏలియ, ఎస్ దుర్గారావు, ఎం.దిలీప్, రామరాజు నాయక్, ఎం రాంబాబు, కార్యకర్తలు రోడ్‌షోలో పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

చింతలపూడి: ముస్లింల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. గురువారం సాయంత్రం చింతలపూడిలో రంజాన్ ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింలకు విజయరాజు ఇఫ్తార్ విందు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగను ప్రతి ముస్లిం సోదరుడు సంతోషంగా జరుపుకోవాలని అభిలషించారు. అనంతరం ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో అంజుమన్ మహఫిజుల్ ఇస్లాం కమిటీ అధ్యక్షుడు సయ్యద్ బాబు, కార్యదర్శి ఎండీ జిలాని, ఎండీ అక్బర్ అలి, సయ్యద్ హాజీ, ఖాజా మొయినుద్దీన్, ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, ఎంపీపీ రాంబాబు నాయక్, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు బొడ్డు వెంకటేశ్వరరావు, మందలపు సాయిబాబు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి గంధం చంటి, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు సాదరబోయిన వరలక్ష్మి, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కె దినేష్‌రెడ్డి, భరత్‌రెడ్డి, ఎస్ రమేష్‌రెడ్డి,, బి చెంచమరాజు, ఆర్‌వీ రామారావు, జి రాజేష్‌నాయుడు, ఎస్ దుర్గారావు, ఎం.దిలీప్, రామరాజు నాయక్, ఎం.రాంబాబు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న విజయరాజు

మండుటెండలో పింఛన్ కోసం..

కుక్కునూరు: వలంటీర్లను అడ్డు తొలగించుకునేందుకు చంద్రబాబు పన్నిన కుట్రతో వృద్ధులు, వికలాంగులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రతి నెలా 1వ తేదీన వలంటీర్లు ఇంటికి వచ్చి ఇచ్చే పింఛన్‌ను, అధికారం దాహంతో చంద్రబాబు తన అనుయాయులతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వలంటీర్లను పింఛన్ ఇవ్వకుండా అడ్డుకున్నారు. దీంతో మండుటెండలో సచివాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకోవాల్సి రావడంతో వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సామాన్యులు సైతం ఎండ వేడికి బయటకు వచ్చేందుకు భయపడుతూ ఇంటికే పరిమితం అవుతున్న సమయంలో తమను మండుటెండలో ఇబ్బందిపడే దుస్థితి చంద్రబాబు కల్పించాడని పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాపం ఊరికే పోదంటూ చంద్రబాబుకు, పొత్తుల పార్టీల నాయకులకు ఈ ఉసురు తగుతుందంటూ వృద్ధులు శాపనార్థాలు పెట్టారు. అంతేగాక తామెంటో చంద్రబాబుకు చూపిస్తామని పలువురు వ్యాఖ్యానించారు.



చేగొండిపల్లి సచివాలయం వద్ద పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

రెండోరోజూ పింఛన్ల పంపిణీ

పోలవరం రూరల్: పోలవరం గ్రామంలో రెండో రోజు కూడా పింఛన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పలువురు వృద్ధులు నానా అవస్థలు పడుతూ సుమారు కిలోమీటరు దూరం పరిధిలోని సచివాలయానికి చేరుకుని, ఆపసోపాలు పడుతూ పింఛన్ తీసుకున్నారు. చంద్రబాబు వల్ల తమకీ దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని సచివాలయాల పరిధిలో దాదాపు పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తయిందని ఎంపీడీవో జి.శ్రీను తెలిపారు. మంచంమీద నుంచి లేవలేని వారు, దివ్యాంగులు, ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి శుక్రవారం సచివాలయ ఉద్యోగులు ఇళ్లకు వెళ్లి పెన్షన్‌లు పంపిణీ చేస్తారన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకురాలికి పరామర్శ

ద్వారకాతిరుమల: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలైన మండలంలోని దేవినేనివారిగూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు కాసాని రేణుకను వైఎస్సార్ సీపీ రాజమండ్రి ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ సతీమణి రాధిక గురువారం పరామర్శించారు. ముందుగా ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని సందర్శించిన ఆమెకు జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, గ్రామ సర్పంచ్ కుంటం స్వర్ణలత, వేంపాడు సర్పంచ్ చవల రమేష్, చిట్టిబొమ్మ ప్రసాద్, కొండాబత్తుల గిరి, చింతమనేని ప్రసాద్ తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె దేవినేనివారిగూడెంకు చేరుకుని రేణుకను పరామర్శించి, అదే గ్రామంలో ఒక శుభకార్యంలో పాల్గొన్నారు. ఆ తరువాత పార్టీ శ్రేణులతో కలసి గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, పార్టీ నేతలు పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, ఎంపీటీసీ జిత్తుక ధనలక్ష్మి, దాకారపు బంగారమ్మ, కేతా కోటేశ్వరరావు, కాసాని సత్యన్నారాయణ, నార్ని నాగేశ్వరరావు, బొండాడ వెంకన్నబాబు, షేక్ ఇస్మయిల్, గొన్నూరి సూరయ్య, మోర్ల ప్రసాదరావు, పాకలపాటి చిన్నయ్య, పాకలపాటి కృష్ణ, పాకలపాటి రామారావు తదితరులున్నారు.



వైఎస్సార్ సీపీ నాయకురాలు రేణుకను పరామర్శిస్తున్న రాధిక, తదితరులు

మంచి చేసిన ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి

రామసింగవరంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం

ద్వారకాతిరుమల: ప్రజలకు సంక్షేమాన్ని చేరువ చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత కుటుంబ సభ్యుడు కొండవీటి ఆశీర్వాదం అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన రామసింగవరంలో గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశీర్వాదం మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేసే వలంటీర్లను టీడీపీ నాయకులు కుట్రతో అడ్డుకున్నారని, దాని కారణంగా వృద్ధులు, వికలాంగులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికల ముందు మోసపూరిత హామీలు ఇవ్వడం టీడీపీకి కొత్తేమి కాదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే జన్మభూమి కమిటీలు ప్రజల రక్తాన్ని పీల్చేస్తాయన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత జగనన్నకు దక్కిందన్నారు. మళ్లీ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను సీఎం చేసుకోవాలన్నారు. అలాగే గోపాలపురం ఎమ్మెల్యేగా తానేటి వనితను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, జేసీఎస్ కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, గ్రామ సర్పంచ్ ఆకురాతి ధ్యానేశ్వరరావు, ఎంపీటీసీ మానికల లవరాజు, పెన్మత్స కొండరాజు, పెన్మత్స పండురాజు, ఉప్పల మునేశ్వరరావు, బిరుదుగడ్డ చల్లారావు, దాసరి ఏసురత్నం, గోపాలపురం నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ ఆచంట సురేష్, కనికెల్లి ఏసు, బిరుదుగడ్డ సుభాకరరావు, మురళీధరరెడ్డి, ముల్లంగి ఈశ్వరరెడ్డి, వసంతాటి సుబ్బారావు తదితరులున్నారు.



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఆశీర్వాదం, పార్టీ నాయకులు

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి

చింతలపూడి: ఎన్నికల విధులను అధికారులు సక్రమంగా నిర్వహించాలని చింతలపూడి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.అద్దయ్య అన్నారు. చింతలపూడి ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎన్నికల అధికారులకు ఆయన సమావేశం నిర్వహించారు. ఈవీఎంలను ఏ విధంగా సిద్ధం చేయాలనే విషయంపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు ఇవ్వకుండా నిర్దేశించిన ప్రతి పనిని అధికారులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ఎలక్షన్ సమయంలో వీవీ ప్యాట్, ఈవీఎంలను పోలింగ్ బూత్‌లకు తీసుకువెళ్లడం నుంచి వాటిని అమర్చి పనిచేస్తున్నాయో, లేదో సరిచూసుకోవడం, ఎన్నికలు పూర్తయిన తరువాత అంతే భద్రంగా వాటిని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించడం, ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత ఎలక్షన్ అధికారులకు తెలియజేయడం వంటి విషయాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల సెక్టోరల్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో ఈవీఎంలు సిద్ధం చేసే విధానంపై వివరిస్తున్న ఆర్డీవో అద్దయ్య

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

పోలవరం రూరల్: ఎల్ఎన్‌డీపేటలోని కొండ్రుకోట ఆర్అండ్‌ఆర్ పునరావాస కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ స్వర్ణకుమారి గురువారం పరిశీలించారు. చిన్నారుల పౌష్టికాహార నిల్వలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. పిల్లల బరువు విషయాలను కార్యకర్తల నుంచి తెలుసుకున్నారు. కోడిగుడ్ల పరిమాణాన్ని పరిశీలించారు. ఆమె వెంట అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాధవి ఉన్నారు.

గిరిజన గ్రామాల్లో సాయుధ దళాల కవాతు

బుట్టాయగూడెం: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుట్టాయగూడెం ఎస్సై కె.వెంకన్న, సిబ్బంది, సాయుధ దళాలతో కలిసి గురువారం మండలంలోని గిరిజన గ్రామాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకన్న మాట్లాడుతూ జిల్లా ఎస్పీ మేరీప్రశాంతి, పోలవరం డీఎస్పీ సురేష్‌కుమార్ రెడ్డి ఆదేశాలతో జీలుగుమిల్లి సీఐ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో గ్రామాల్లో సాయుధ దళాలతో కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు వారి ఓటు హక్కును స్వచ్ఛంగా, నిర్భయంగా పక్షపాతం లేకుండా వినియోగించుకోవాలన్నారు. చుకునే విధంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలను ప్రజలు, రాజకీయ పార్టీలవారు పాటించాలని అన్నారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి రూ.50 వేల కంటే ఎక్కువ నగదు ప్రయాణం చేసే సమయంలో సరైన ధ్రువపత్రాలను పోలీస్‌వారికి సమర్పించాలని, లేకుంటే ఆ డబ్బును స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని చెప్పారు.

నేటినుంచి నూకాలమ్మ జాతర

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని నూకాలమ్మ 60వ వార్షిక జాతర మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు నిత్య పూజా కార్యక్రమాలు పూర్తి చేసి, అమ్మవారి గరగలు తీయడం జరుగుతుందని, గ్రామ దేవత శ్రీ గంగానమ్మ అమ్మవారి ఆలయం నుంచి ఉదయం 9 గంటలకు 1008 మంది మహిళలచే శోభాయాత్ర నిర్వహించనున్నట్లు రాజాన తెలిపారు. నూకాలమ్మకు పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు, పండ్లు, చీర, సారె శ్రీగంగానమ్మ ఆలయ కమిటీ తరుపున సమర్పిస్తారని ఆలయ ప్రధాన అర్చకులు మనోజ్‌శర్మ తెలియజేశారు.